
**కథ**

# మా ఇంటి మాలక్ష్మి



-కాకాని కమల

అనుకోకుండా ఆఫీసుకి నాలుగు రోజులు శెలవులు కల్సివచ్చాయి ఎన్నాళ్ళ నుంచో మా అక్క బావగారు వాళ్ళ ఊరు విశాఖ పట్నం రమ్మని గోల చేస్తున్నారు. మా మేనల్లుడు, మేనకోడలు కూడా "మావయ్యా మా ఇంటికి ఎప్పుడు వస్తున్నావ్? నువ్వు పచ్చాక చుట్టుపక్కల సైటు సీయింగ్‌కి వెళ్దాం.'' అని ఉత్తరాలు రాస్తున్నారు.

ఈ మధ్య నాకూ కాస్త బోర్‌గానే ఉంది లైఫ్.

అందుకే విశాఖపట్నం ప్రయాణం పెట్టుకున్నాను.

బ్రీఫ్ కేస్‌లో బట్టలు సర్దుకుని బస్ స్టాండుకి వచ్చేసరికి స్టేజిలో బస్సు లేదు. అప్పుడే ఒకటి వెళ్ళిపోయింది. ఇంకో బస్సు అరగంటలో వస్తుందని ఎంక్వయిరిలో చెప్పారు.

బస్సు రావటానికి పదినిమిషాల ముందు టిక్కట్లు ఇస్తారుట.

ఈ మధ్య బస్సు స్టేషన్ బాగా కడుతున్నారు. సగం వరకు పూర్తి అయింది. ఇంకా వర్క్ నడుస్తూంది. అంతా ఒకసారి చుట్టూ కలయచూస్తూ వచ్చి సిమెంట్ బెంచి మీద కూర్చున్నాను. పాసింజర్సు అంతగా లేరు.

తీరుబడిగా బ్యాగ్‌లోంచి ఇండియా టుడే తీసి తిరగెయ్యబోయేటంతలో లబలబలబ మంటు ఏదో గోల వినిపించి తలెత్తాను.

ఎవరో ఆడమనిషి, ఒక ఆసామి పరిగెడుతున్నట్లు ఖంగారుగా స్టాండింగ్‌లోకి వచ్చి ఆరవ నెంబరు ప్లాట్ ఫారం మీదకి వచ్చారు.

ఇద్దరూ నలభై దాటిన వయసు వాళ్ళే. రైతు జంటలా ఉన్నారు. ఆడమనిషి నడి నెత్తిన కొప్పు, చేతుల నిండా కడియాలు, మలారంలా గాజులు, పెద్ద బొట్టు, ముక్కుకి రాళ్ళ బేసరితో మోటుగా ఉంది. ఆకు పచ్చ ముదుర్రంగు జరీ చీర కచ్చా పోసి కట్టుకుంది. ఆమె భర్త తలకి గుడ్డ చుట్టుకున్నాడు. ఉప్పాడ జరీ పంచె, ఖద్దరు సిల్కు పొడుగు చేతుల చొక్కా. వాళ్ళతో ఓ పధ్నాలుగేళ్ళ అమ్మాయి కూడా ఉంది. ఆ ఆడ మనిషి పెద్దగా శోకం తీస్తు ఏడుస్తూంది. మధ్య మధ్య గుండెల మీద చెయ్యి వేసుకుని "ఓలమ్మో! నా బిడ్డ! ఎంత ఘోరం జరిగి పోనాదె నా తల్లి? అప్పుడే నీకు నూరేళ్ళు నిండిపొయ్యాయా నాకూతురా' అంటూ వలవల ఏడుస్తోంది. కడుపు శోకంతో కదిలిపోతూంది. పయిట చెంగుతో ముక్కు కళ్ళు తుడుచుకుంటూంది. నిలబడలేని దానిలా గభాల్న ప్లాట్ ఫాం మీద చతికిలబడింది. పయిట చెంగు తల మీద వేసుకుని "ఓ నా తల్లి? ఓ నా తల్లి?'' అని సన్నగా శోకం తీస్తూ కుమిలి పోతూంది.

ఆ ఆసామి చేతిలో సంచులు రెండూ ఆ పిల్ల పక్కన పెట్టి "మీ పిన్నమ్మని జర్రంత సూసుకో బిడ్డా! బస్సు ఎప్పటికి వస్తుందో తెలిసికొనివస్తా'' అంటూ ఎంక్వయిరీ వైపు పరిగెత్తాడు.

"'బేగిరా నాసావి! నా బిడ్డని సూడకుండా నాపాణం నిలబడటం లేదయ్యా' అంటు ఆవిడ దుఃఖంతో తల్లడిల్లి పోతూ బాధ తట్టుకోలేని దానిలా అరచేత్తో గుండెల్ని రాసుకోసాగింది.

ఆ ఆసామి పరిగెత్తినట్లు అలా వెళ్ళి ఇలా వచ్చాడు ఆఘ మేఘాల మీద. "ఓ గంట దాకా కాకినాడకి బస్సు లేదంట.'' అన్నాడు రొప్పుతూ.

"అదేందయ్యా! ఓ గంట సేపంటే నేనుండలేనయ్యా నా బిడ్డని సూడకుండా నాపాణం నిలబడదయ్యా. నిన్ననగా అన్యాయం అయిపోయిన పిల్ల. ఆళ్ళు దురమారుగులు ఆకరి సూపన్నా నాకు దక్కనిస్తర్రో లేదో.... నా బిడ్డో... ఓలమ్మో.... నా తల్లి?" అంటూ మళ్ళీ శోకం అందు కుంది.

ఆ చిన్న పిల్ల బెంబేలెత్తినట్లు - "ఊకో పిన్నమ్మ ఊకో" అంటూంది.

"సీతారత్నం, నువ్వు అనవసరంగా ఖంగారు పడమాకు. నీ కసలే గుండె జబ్బు. ఏదన్నా టాక్సీ వుందేమో అరుసు కొస్తా. శాయిలీలా. మీ పిన్నమ్మని జర్రంతో సూసుకో తల్లి. అటెల్లి ఆ టాక్సీ మాట్లాడు కొస్తా" అంటూ ఆ ఆసామి మళ్ళీ బస్సు స్టాండుకి అటు దిక్కుగా వున్న టాక్సీ స్టాండ్ వైపు పరిగెత్తాడు ఆదరబాదరగా.

అప్పటికే బస్సు షెల్టరులోని పాసిం జర్సు దృష్టి అంతా ఏడుస్తున్న ఆ సీతా రత్నం అన్న ఆవిడ మీదికి మళ్ళింది.

కడివెడు దుఃఖంతో కడుపు శోకంతో ఆ తల్లి మనసు నీలిబిలి అయిపోతూంది. "ఊకో పిన్నమ్మా ఊకో...." అంటూ ఆ చిన్న పిల్ల సముదాయిస్తూంది. అందరితో పాటు నేనూ ఆవిడ వైపు చూస్తున్నాను. ఇంతలో చుట్టు వున్న నల్గురు ఆడాళ్ళు ఆవిడ వైపు చేరారు.

"ఏమైంది పాపా? ఏమైంది?" అంది ఒకావిడ ఆరాగా.

తన దగ్గరున్న చిన్న బాటిల్‌లోంచి ప్లాస్టిక్ కప్పులోకి నీళ్ళు పోసి ఆపిల్లకి అందిస్తూ "మీ పిన్నమ్మకి తాగిపియ్యి" అంది.

"ఏ మైంది? ఏ ఊరు పోవాలి?"

"కాకినాడ పోవాలి. మా పిన్నమ్మకి ఒక్కతే కూతురు మాలచ్మి నిన్న రేత్తిరి చనిపోయిందంట"

"అయ్యో అలాగా! ఏమిటి జబ్బు?"

"మా పిన్నమ్మ కూతురు మాలచ్మికి ఇద్దరాడ పిల్లలు. మొన్న మూడవ సారి పురుటయ్యింది. ఈసారి కూడా ఆడపిల్లే పుట్టింది. మళ్ళీ ఆడపిల్లే పుడితే నిన్నూ దాన్నీ కూడా సంపెత్తానన్నాడంట మా బావ. ఇడాకులిచ్చి మగపిల్లగాడి కోసం వేరే పెండ్లి సేసుకుంటానని కూడా సతా యిత్తన్నాడంట. ఆళ్ళకి కూడా మా బావ ఒక్కడే కొడుకు. కాకినాడ దగ్గిర ఊళ్ళో ఉంటారు. ఎగసాయం. మగ పిల్లగాడు లేకుంటే వంశం నిలబడదని మా అక్క అత్తమావ ఆడబిడ్డ కూడా బాగా అక్కని సతాయిత్తన్నారంట. అక్క మూడవసారి కూడా ఆడపిల్లే పుట్టిందని బయ్యంతో కాపురానికి పోనంటే మా పిన్నయ్య బల వంతాన పది దినాల కితం దించి వచ్చి నాడు....

"మూడవ నెల వచ్చింది ఇంకెన్నా ళ్ళుంటావ్ నేను మీ అత్తోరికి నచ్చచెప్పు తానని" తీసుకెళ్ళిదించి వచ్చినాడు.

కాని ఆళ్ళు రోజూ బాగా సతాయిత్తన్నా రని, సంటి బిడ్డ నోట్లో వడ్లగింజలు వేసి సంపాలని ఒక రోజుపెయిత్నిస్తుంటే మా అక్క సూసి లబలబ లాడిందంట. ఆ రోజు మా అక్కని బాగా కొట్టిండంట మా బావ. విడాకులకి ఒప్పుకోమని నిత్తెం సతాయిత్తన్నారంట. అక్క ఏడ్చుకుంటూ వారం దినాల కితం ఉత్తరం రాసింది. మా పిన్నాన్నకి ఎటు పాలుపోక మా ఊరి పెద్ద దొర సలహా తీసుకుని నల్గురు పెద్ద మనుసుల్ని ఎంట పెట్టుకుని కాకినాడ ఎళదామనుకుంటున్నాడు. ఇంతలోనే నిన్న అక్క, సంటి పిల్ల వాతం కమ్మి సచ్చి పోనారని ఎంటనే బయలు దేరి రమ్మని టెలిగ్రాం వచ్చింది.

ఆళ్ళిద్దరు వాతం కమ్మి సచ్చిపోలే దని, బలవంతాన అత్తింటి ఓళ్ళే సంపేసి వుంటారని మా పిన్నమ్మ అంటూంది. మా పిన్నమ్మకి మా అక్క మాలచ్మి ఒక్కతే సంతానం. ముందు ఎనక ఎవ్వరూ లేరు. పిన్నమ్మ నోములు నొవ్వగా అక్క పుట్టింది.

"అయ్యయ్యో! పాపం అలాగా! ఎంత గోరం జరిగిపోయిందమ్మా మరీ దుర్మార్గం కాకపోతే పుట్టే బిడ్డ ఆడైనా మగైనా మన చేతుల్లో ఏం ఉంది? ఏం మీ అక్క అత్త ఆడది కాదా? ఆడబిడ్డ ఆడది కాదా? వాళ్ళకి బుద్ధి లేకపోతే మీ బావకెలా లేదు. ఆడైనా మగైనా ఏ బిడ్డ పుట్టటాని కైనా మగాడే కారణం. ఆ ఇంగితం లేకుండా ముగ్గురు బిడ్డల తల్లిని పొట్టన పెట్టుకున్నారా? అన్నాళ్ళు కాపురం చేశాక కూడా ఆడదానికి రక్షణ, సంసారంలో సుఖం లేకపోతే, మగాడు ఎంత దుర్మార్గం గా మారిపొయ్యాడో అర్థం అవుతూంది. తాళి కట్టిన వాడే పాడె సిద్ధం చేస్తే ఆడది ఏం చెయ్యగల్దు?"

"అయినా ఇదేం పొయ్యే కాలమో నమ్మా వరకట్నం చాలలేదని కోడళ్ళని సజీవ దహనం చెయ్యటం, ఆడ పిల్లని కందని అన్యాయంగా హత్య చెయ్యటం... ఆడది లేకుండా మగాడు బతగ్గలడేమో బతకనియ్యండి."

"ఆడదానికి కాని రోజులు వచ్చా యమ్మా" చుట్టూ చేరిన జనం నల్గురూ



నాలుగు రకాలుగా వ్యాఖ్యానించటం మొదలు పెట్టారు.

అంతలో ఆ ఆసామి పరుగు పరుగున వచ్చాడు.

"పదండ్రి టాక్సీ మాట్లాడాను" అంటూ భార్యని చెయ్యి పట్టుకుని లేవ దీశాడు.

ఆ పిల్లో సంచి ఆయనో సంచి పట్టు కున్నారు.

ఏడుస్తూనే ఆవిడ టాక్సీ ఎక్కింది. టాక్సీ కనుమరుగు అయ్యే దాకా ఆవిడ శోకం గాలిలో ప్రతిధ్వనిస్తూనే ఉంది.

"ఏంటో మాస్టారూ. ఈ మధ్య ఈ వరకట్నం చావులు, ఆడ పిల్ల అని స్కానింగ్‌లో తెలియగానే అబార్షన్స్ చేయించటం, ఆడపిల్ల అనగానే చంపె య్యటం, ఎదురు తిరిగితే భార్యని హింసిం చటం, లేదూ విడాకులు ఇవ్వటం, నల్గురు పిల్లల తండ్రి కూడా వంశోద్ధార కుడి కోసం అంటూ మళ్ళీ పెళ్ళికి సిద్ధ పడటం....

"నిజంగానే మనం అన్యాయంగా మృగం కంటె హీనంగా మానవత్వం మరిచి పోతున్నామా అనిపిస్తుంది నాకు."

నాతో పాటే బెంచి మీద కూర్చున్న యువకుడు గుబులుగా వ్యాఖ్యానిస్తుంటే నా మనసు దెబ్బ తిన్నట్లు మూల్గింది. నాల్గు నెల్ల క్రితం నా భార్య తొలిచూలుకి పుట్టింటికి వెళ్ళింది.

"ఒకరు లేక ఇద్దరు" అంటుంది ప్రభుత్వం.

కాని తను ఒక్కడే బిడ్డ, అదీ మగబిడ్డ కావాలి అనుకున్నాడు. భార్యకి నిక్కచ్చిగా ఆ విషయం చెప్పాడు, కాదు. శాసించాడు.

ఆడపిల్ల పుడితే తనకి అవసరం లేదని పుట్టింట్లోనే వదిలి రమ్మని లేకుంటే విడాకులు తప్పవని చెప్పాడు.

ఆడపిల్లే పుట్టింది. నెలా పదిహేను రోజులు అయ్యింది. అయినా తను చూడటానికి వెళ్ళలేదు. భార్య చాలా ఉత్తరాలు రాసింది.

మావగారు వచ్చి మరీ మరీ ప్రాధేయ పడి వెళ్ళాడు. అయినా తన మనసు కదల లేదు.

తన భార్య కాపురానికి రాదల్చు కుంటే ఒంటరిగానే రమ్మని ఆ పిల్ల పెం పకం, చదువు, పెళ్ళి ఇలాంటి బాధ్యతలు ఏవీ తనకి లేవని, తనకి బిడ్డ పుట్టినా తన దృష్టిలో చచ్చిపోయినట్లే లెక్క అనీ భార్యకి చెప్పాడు కాని తను ఇప్పుడు తల్చుకుంటే ఎంతో మూర్ఖంగా ప్రవర్తిం చాడో అర్థం అవుతూంది.

"ఏం? ఆ పిల్ల అత్త ఆడది కాదా? ఆడబిడ్డ ఆడది కాదా? ఆడది లేకుండా తల్లి చెల్లి అన్న మమకారం లేకుండా మొండి గోడలా మగాడు బతుకుదా మనుకుంటున్నాడేమో.... సరే... బతక నీయండి."

"నవమాసాలు మొయ్యటమే గాని పుట్టేదాకా ఏ పిల్ల పుడుతుందో మనకే తెలియదు. మన చేతుల్లో ఏం ఉందని? ఆడపిల్లంటే లక్ష్మితో సమానం" ఇందాకా ఎవరో ఆగుంపులో అన్న మాటలు చెవుల్లో గింగురు మంటుంటే నా విశాఖ ప్రయా ణం అప్పటికప్పుడు క్యాన్సిల్ చేసు కుని - టిక్కెట్టు కౌంటర్ వైపు పరిగె త్తాను.

మా మావగారి ఊరు అమలాపురం వెళ్ళే బస్సు స్టేజిలో సిద్ధంగా ఉంది! ✪